RNI APTEL/25/A0798

# టుడే విదుర

జాతీయ తెలుగు దిన పత్రిక

https://www.todayvidhura.com/

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సంపుటి : 1 సంచిక:49 9-8-2025 శనివారం ఎడిటర్ :మర్రి పవీణ్ పేజీలు : 8 వెల 4 /-

## రాహుల్‌గాంధీకి సవాల్ విసిరిన ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ,ఆగస్టు 8(టుడే విదుర): లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కైందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయటపడ్డాయి అని రాహుల్ పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

## తెలుగింటి ఆడపడుచులందరికీ వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు




అమరావతి,ఆగస్టు 8(టుడే విదుర): ప్రతి సంవత్సరం, శ్రావణ మాసంలో వరమహాలక్ష్మి పండుగను జరుపుకుంటారు. ఈ రోజున మహిళలు ఉపవాసం ఉంటూ దీర్ఘకాలం సుమంగళిగా ఉండాలని వరలక్ష్మీ వ్రతం చేస్తారు. సిరుల తల్లి లక్ష్మీదేవిని భక్తితో పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు లభిస్తాయని వారి నమ్మకం. ఈ పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగింటి ఆడపడుచులందరికీ వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు తెలిపారు. ఆ మహాలక్ష్మి మీ ఇంటిల్లిపాదికీ అష్టైశ్వర్యాలు, ఆరోగ్య, ఆనందాలను అనుగ్రహించాలని కోరుకుంటున్నట్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. లోకేశ్ ఎక్స్ లో స్పందిస్తూ.. వరలక్ష్మీ వ్రతం మహిళలకు ఎంతో ప్రత్యేకమైనదన్నారు. వరలక్ష్మీ దేవి అనుగ్రహం అందరికీ అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగ చేయాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరికీ కలగాలని కోరుకుంటూ శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం శుభాకాంక్షలు తెలిపారు మంత్రి నారా లోకేశ్. మరోవైపు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ వరలక్ష్మీ వ్రతం పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మహిళలు ఉదయానే లేచి భక్తిశ్రద్ధలతో పూజలు ప్రారంభించారు. వరలక్ష్మీ వ్రతం అనేది హిందూ సంప్రదాయంలో ఒక ముఖ్యమైన పండుగ. వరలక్ష్మీ దేవి విష్ణుమూర్తి భార్య, లక్ష్మీదేవి అవతారంగా భావిస్తారు. ఈ రోజున స్త్రీలు ఉపవాసం ఉండి, వరలక్ష్మీ దేవిని భక్తితో పూజిస్తారు. తమ కుటుంబసభ్యుల ఆరోగ్యం, సుఖం కోసం దీవెనలు కోరుకుంటారు.

## 14 మంది ఎస్‌పీఎస్ అధికారులకు ఐపీఎస్‌లుగా పదోన్నతి..




అమరావతి,ఆగస్టు 8(టుడే విదుర):కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన 14 మందికి ఐపీఎస్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ..కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐపీఎస్‌లుగా ఎన్నికైనా అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు ప్రొబేషన్‌లో ఉండాలని సూచించింది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన పదోన్నతి కమిటీ పదోన్నతులకు ఆమోదం తెలిపింది. 2010 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన చౌడేశ్వరి, లక్ష్మీనారాయణ, ఈశ్వర్‌రావు, హిమావతి, లావణ్య లక్ష్మి, వెంకటరత్నం, లత మాధురి, సురేష్ బాబు, కరీముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, కృష్ణ ప్రసన్న, శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి ఇచ్చింది. దీనికి సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఇవాళ కమిటీ విడుదల చేసింది.

## రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన స్టాలిన్




చెన్నై,ఆగస్టు 8(టుడే విదుర): రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం-పాఠశాల విద్యను ప్రవేశపెట్టారు. తమిళం, మరియు ఇంగ్లీషు బోధించాలనే ద్విభాషా విధానాన్ని పునరుద్ఘాటించారు. చెన్నైలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో స్టాలిన్ రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. బట్టీ పట్టడానికి బదులుగా, విద్యార్థులు ఆలోచించడానికి, పనిచేయడానికి తోడ్పడటమే ఈ పాలసీ ఉద్దేశ్యమనిస్టాలిన్ పేర్కొన్నారు. విద్యార్థులను సృజనాత్మకంగా తీర్చి దిద్దడం, విద్యను శారీరక్ష శిక్షణతో అనుసంధానించడం మరియు తమిళ భాష ప్రాముఖ్యతను స్పష్టం చేయడం ఈ పాలసీ లక్ష్యమని అన్నారు. ఈ ఏడాది 12వతరగతి పరీక్షలు పూర్తి చేసిన వారిలో సుమారు 72శాతం మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, భవిష్యత్తులో ఈ సంఖ్య అధికంగా ఉంటుందని, 100శాతం సాధించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యను తిరిగి రాష్ట్ర జాబితాలోకి తీసుకురావాలనే తమిళనాడు ప్రభుత్వ వైఖరిని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పునరుద్ఘాటించారు. జస్టిస్ డి. మురుగేశన్ కమిటీ చేసిన సిఫారసుల ఆధారంగా ప్రత్యేక రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించారు. ఈ కమిటీలో విద్యావేత్తలు, క్రీడలు, సంగతం వంటి రంగాలకు చెందిన నిపుణులు ఉన్నారు. త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరి చేస్తూ జాతీయ విద్యావిధానం అమలు చేయాలని కేంద్రం పట్టుబడుతున్న సంగతి తెలిసిందే.

## వైసీపీకి, వైఎస్సార్‌కు సంబంధం లేదు.. షర్మిలా హాట్ కామెంట్స్



విజయవాడ,ఆగస్టు 8(టుడే విదుర): చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం పై కోపాన్ని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాల మీద చూపిస్తుందని ఆరోపించారు. ఆమె ఇవాళ(శుక్రవారం) మీడియాతో మాట్లాడారు. అసలు కి ఏం సంబంధం అని నిలదీశారు. మహానేత పేరు పెట్టినంత మాత్రాన ఏమైనా ఆయన వారి సొత్తా.. లేక పేటెంట్ రైటా అని షర్మిలా ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక గొప్ప ముఖ్యమంత్రి అని గుర్తు చేశారు. చివరి క్షణం దాకా తన జీవితాన్ని ప్రజల కోసమే త్యాగం చేసిన ప్రజా నాయకుడని కీర్తించారు. తెలుగు ప్రజల గుండెల్లో ఆయనది చెరగని ముద్ర అని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో ఈ దేశానికి దిశా నిర్దేశం అని పేర్కొన్నారు. ప్రజాక్షేమమే పరమావధిగా చివరి దాకా పరితపించిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని చెప్పుకొచ్చారు. ఇంతటి ప్రజాభిమానం కలిగిన గొప్పనాయకుడిని నీచ రాజకీయాలు చేసే వారితో కలిపి ఆపాదిస్తారా.. అని షర్మిలా మండిపడ్డారు. ఆయన విగ్రహాల మీద కక్ష రాజకీయాలు చేస్తారా అని ప్రశ్నించారు. నందిగామ గాంధీ సెంటర్‌లో మహానేత విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మహానేత మరణం తర్వాత నాటి ప్రభుత్వం అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని షర్మిలా గుర్తు చేశారు. విగ్రహం చుట్టూ అక్రమంగా వేసుకున్న సెట్టింగులు తొలగించుకోమని సూచించారు. కానీ ఇదే సాకుగా చూపి విగ్రహాల మీద చేయివేస్తే.. చూస్తూ ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. కి విగ్రహాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. తొలగించిన చోట వెంటనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని.. కూటమి ప్రభుత్వాన్ని షర్మిలా డిమాండ్ చేశారు.

## 2013 భూసేకరణ చట్టంపై అవగాహన అవసరం



విజయవాడ,ఆగస్టు 8(టుడే విదుర): 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, భూములు కోల్పోతున్న రైతులు, కూలీలకు ఈ చట్టంపై అవగాహనా కల్పించే లక్ష్యంతో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకాన్ని ఈరోజు విజయవాడలోని బాలోత్సవ భవనంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ కరేడు, ఉద్దానం, నంద్యాల, అల్లూరి, సత్యసాయి వంటి జిల్లాల్లో 20 లక్షల ఎకరాలు లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న తరుణంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## సిబిఎస్‌ఇ ఛైర్మన్ పదవీకాలం పొడిగింపు

న్యూఢిల్లీ,ఆగస్టు 8(టుడే విదుర): సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) ఛైర్మన్ రాహుల్ సింగ్ పదవీకాలాన్ని కేంద్రం పొడిగించింది. ఆయన పదవీకాలాన్ని రెండేళ్లు పొడిగించినట్లు శుక్రవారం విడుదలైన అధికారిక ఉత్తర్వులు తెలిపాయి. బీహార్ కేడర్‌కు చెందిన 1996 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన రాహుల్ సింగ్ గతేడాది మార్చి 13న సిబిఎస్ఇ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఆయన పదవీకాలాన్ని 2025 నవంబర్ 11 నుండి 2027 నవంబర్ 11 వరకు రెండు పొడిగించడానికి క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఆమోదం తెలిపింది.

## హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన వైఎస్ భాస్కర్ రెడ్డి




హైదరాబాద్,ఆగస్టు 8(టుడే విదుర): వివేకా హత్య కేసు నిందితుడు వైఎస్ భాస్కర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఏపీకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ.. ఎంపీ అవినాష్ రెడ్డి తండ్రి భాస్కర్ రెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే.. ఇప్పటికే షరతులతో కూడా బెయిల్‌పై భాస్కర్ రెడ్డి బయటే ఉన్న సంగతి తెలిసిందే. కాగా, ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా ఏపీలో ప్రవేశించవద్దని హైకోర్టు గతంలో షరతులు విధించింది. అయితే ఆ షరతులను సడలించాలని తాజాగా భాస్కర్ రెడ్డి పిటిషన్ వేశారు. పులివెందులలో తనకు వ్యవసాయం ఉందని, అనారోగ్యంతో ఉన్నానని ఏపీలో అడుగు పెట్టేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన పిటిషన్‌లో వివరించారు. తాజాగా మాజీ మంత్రి వివేకా హత్య కేసు దర్యాప్తు పూర్తయినట్లు సుప్రీంకోర్టుకు సీబీఐ తెలిపింది. ఒక వేళ సుప్రీం ఆదేశిస్తే తదుపరి విచారణ జరుపుతామని సీబీఐ పేర్కొంది. ఈ మేరకు ధర్మాసనానికి సీబీఐ వెల్లడించింది.

## సంవత్సరం లోపే హంద్రీనీవా కాలువని రెండింతల సామర్థ్యానికి పెంచాం : పయ్యావుల కేశవ్



ఉరవకొండ (అనంతపురం) ఆగస్టు 8(టుడే విదుర): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే హంద్రీనీవా కాలువని రెండింతల సామర్థ్యానికి పెంచామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం వజ్రకరూరు మండలం శ్రీరామనగర్ మజారా పదవ వార్డు (బొడిసానిపల్లి) గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి, నాగప్రతిష్ట, ధ్వజస్తంభ శిఖర, గ్రామశిల ప్రతిష్ట, శ్రీరామనగర్ కాలనీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ఈ శుభ కార్యక్రమంలో పాలుపంచుకోవడం చాలా సంతోషం అన్నారు. ఆంజనేయ స్వామి గుడి ప్రారంభోత్సవం, కొత్తగా ఒక గ్రామం 40 ఏళ్లు నివసించేలా ఏర్పాటు చేసుకోవడం ఆనందకరమన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఏ అభివృద్ధి కార్యక్రమం జరిగినా అందులో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషమని, 1994 నుంచి ఇప్పటివరకు రాజకీయ అభివృద్ధిలో ప్రతి దశలో ప్రజలంతా నన్ను ఆశీర్వదిస్తూ వచ్చారన్నారు. రాజకీయ ఎదుగుదలలో ఇంతటి మహోన్నత స్థాయికి తీసుకురావడానికి సహకరించిన నాయకులకు, ఉరవకొండ నియోజకవర్గం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి మొదటి కూలీగానే పని చేస్తానని తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, సమస్యలను పరిష్కారం చేయాలంటే నాపై ఉన్న నమ్మకం ఏ మాత్రం వమ్ము కానీయకుండా మీ అందరి ఆశలు, ఆకాంక్షల్ని తీర్చడానికి భగవంతుడు శక్తి ఇచ్చిన మేరకు తాను పనిచేస్తానన్నారు. మనుషులకు చేపలు తెచ్చి పెట్టడం కాదు.. చేపలు పట్టడం నేర్పించమని కార్ల్ మార్క్స్ చెప్పారని, మనుషులను వారి కాళ్లపై వాళ్లు నిలబడేలా చేయాలన్నారు. 2019 ఎన్నికలకు ముందు మాజీ ముఖ్యమంత్రి జగన్ ఉరవకొండకి వచ్చి అధికారంలోకి వస్తే మూడు నెలల్లో హంద్రీనీవా పనులు ప్రారంభిస్తామని చెప్పారని, అయితే ఐదేళ్లలో ఒక గంప మన్ను తీయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోపల ఆరు మోటర్ల నుంచి 12 మోటర్లకు వాడుకునేలా కాలువని రెండింతల సామర్థ్యానికి తీసుకువెళ్లడం జరిగిందని, అది తమ ప్రభుత్వానికి ఉరవకొండ నియోజకవర్గం అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధి అన్నారు. తాను ఎక్కడ ఉన్న తన మనసు ఇక్కడే ఉంటుందని, నియోజకవర్గ అభివృద్ధిలో పాలుపంచుకుంటానన్నారు. ఈరోజు హంద్రీనీవా మెయిన్ కెనాల్ ని పూర్తి చేశామని, తర్వాత పిల్ల కాలువలకు వెళతామని, రోడ్లు వేస్తున్నామని, స్కూల్ భవనాలను రూపుదిద్దే ప్రయత్నం చేస్తున్నామని, చెప్పినట్టుగానే ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇచ్చామని, పెన్షన్లను 4,000 చేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేయడంలో రూపాయి ఎలా తీసుకురావాలి ? ఎలా ఖర్చు పెట్టాలో నేర్పించే మహిళలే తనకు స్ఫూర్తి అని అన్నారు. 10 లక్షల కోట్ల అప్పు ఉండి, లక్ష కోట్ల బిల్లులున్నా ఉన్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ల పెంపు పథకాలన్నీ అమలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తాము ప్రజల కోసమే కష్టమైన పని చేస్తున్నామన్నారు. ప్రజలు, రైతుల జీవితాల్లో వెలుగు రావాలని హంద్రీనీవా కాలువని వెడల్పు చేశామని, తాను వస్తూ కాలవలో నీళ్లు చూస్తే సంతోషం వేసిందన్నారు. గతంలో అభివృద్ధి పనులు చేయలేదని, గతానికంటే రెండింతలు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనునిత్యం చెబుతున్నారని, అందుకు అనుగుణంగా భవిష్యత్తు కోసం, రేపటి తరం కోసం తాము కష్టపడి పని చేస్తున్నామన్నారు. రైతులు, మహిళల జీవితాల్లో మార్పు రావాలని లక్ష్యంగా కృషి చేస్తున్నామని, చెప్పిన మాటను ఎంత కష్టమైనా నిలబెట్టుకుంటామన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో అభివృద్ధిని ఇప్పటికే పరుగులు పెట్టిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ఉరవకొండ పట్టణంలో 15 రోజులకు ఒకసారి నీళ్లు ఇచ్చేవారని, తమ ప్రభుత్వం వచ్చిన సంవత్సరం కాలంలోనే, నూరు రోజుల్లోనే తాము పని చేసి రోజు విడిచి రోజు ఉరవకొండ పట్టణంలో నీరు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధిని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశులు, క్లస్టర్ ఇంఛార్జి నాగేంద్ర, నాయకులు నాగభూషణం, నాగన్న, పెద్దన్న, ప్యాపిలి.సీనప్ప, ఆడివప్ప తదితరులు పాల్గొన్నారు.

# వెల్డింగ్ షాప్‌లో భారీ విస్ఫోటం

**విశాఖలో ముగ్గురి దుర్మరణం**

**తునాతునకలైన మరో రెండు దుకాణాలు**

**ముగ్గురికి తీవ్రగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం**

**సముద్రంలో దొరికిన వస్తువు కట్ చేస్తుండగా పేలుడు జరిగినట్లు అనుమానాలు**



విశాఖపట్నం,ఆగస్టు 8(టుడే విదుర):విశాఖ ఫిషింగ్ హార్బర్ సమీపంలోని ఒక వెల్డింగ్ దుకాణంలో సాయంత్రం భారీపేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. దుకాణంలో పనిచేస్తున్న మరో ఇద్దరితోపాటు పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని తీవ్రంగా గాయపడ్డారు. హార్బర్ సమీపంలోని బుక్కా వీధిలో బీచ్‌రోడ్డును ఆనుకుని హిమాలయా బార్ పక్కన చల్లా గణేష్ కుమార్ (40) వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నారు. సముద్రంలో వేటకు వెళ్లి వచ్చే బోట్ల విడిభాగాలు దెబ్బతింటే వాటిని వెల్డింగ్ చేసి మరమ్మతులు చేస్తుంటారు. ఆ దుకాణంలో గణేష్‌తో పాటు ఒడిశాకు చెందిన శ్రీను, మధురవాడకు చెందిన కె.ఎల్లాజీ, బుక్కావీధికి చెందిన చింతకాయల ముత్యాలు (27), వన్‌టౌన్‌కు చెందిన డి.సన్యాసిరావుతోపాటు మరో ముగ్గురు పనిచేస్తున్నారు. సరిగ్గా సాయంత్రం 4.30 గంటల సమయంలో దుకాణంలో వెల్డింగ్ పనులు చేస్తుండగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ ధాటికి చెక్క, రేకులతో కూడిన వెల్డింగ్ షాప్ తునాతునకలైపోగా, పక్కనున్న అలాంటివే మరో రెండు దుకాణాలు సైతం దెబ్బతిని చెల్లాచెదురైపోయాయి. షాప్ యజమాని గణేష్ కుమార్, శ్రీను శరీరాలు పూర్తిగా కాలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ముత్యాలు కాలు విరిగిపోయి వేరొకచోట పడింది. ముఖం, ఛాతీ, చేతులు కాలిపోయాయి.ఎల్లాజీకి 95 శాతం శరీరం కాలిపోగా, సన్యాసిరావు పొట్ట, శరీరంలోకి ఇనుపముక్కలు దూసుకుపోయాయి. పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం యజమాని చెంగలరావుపేట, తెలకల వీధికి చెందిన ఇప్పిలి రంగారావుకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, వన్‌టౌన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన క్షతగాత్రులను కేజీహెచ్‌కు తరలించారు. ముత్యాలుకు చికిత్స అందిస్తుండగా ప్రాణాలు విడిచారు.

# ఎస్టీ స్టడీ సర్కిళ్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్



అమరావతి, ఆగస్టు 8(టుడే విదుర): ఎస్టీ యువతకు ఉద్యోగావకాశాల కోసం పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు కానున్నాయి. ఈమేరకు అనుమతి ఇస్తూ గిరిజన సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నంలోని వేపగుంట, విజయవాడ,/గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ప్రతిపాదనలు పంపడంతో ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అర్హత కలిగిన ఎస్టీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఏడాదికి రూ.4.22 కోట్లు మంజూరుచేయనున్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డైరక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

# విద్యార్థిని ఫొటోలు అడ్డుపెట్టుకుని వేధింపులు

దివాన్‌చెరువు ఆగస్టు 8(టుడే విదుర): ఫొటోలు అడ్డుపెట్టుకుని విద్యార్థినిని వేధిస్తున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అడహక్ సహాయ ప్రొఫెసర్ కె.యామినీ జ్యోత్స్న, మరో నలుగురు విద్యార్థులపై తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం. తాను మరో వ్యక్తితో సాన్నిహిత్యంగా ఉండడాన్ని ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తనను వేధిస్తున్నారంటూ యామినీ జ్యోత్స్నతో పాటు మరో నలుగురు విద్యార్థులపై బయోటెక్నాలజీ విద్యార్థిని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. నన్నయ వర్సిటీలో పనిచేస్తున్న ఇద్దరు తాత్కాలిక అధ్యాపకుల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో తనను టార్గెట్ చేసి మానసికంగా వేధిస్తున్నారంటూ ఆ విద్యార్థిని ఫిర్యాదులో పేర్కొందన్నారు. ఈ మేరకు వివిధ సెక్షన్ల కింద యామినీ జ్యోత్స్నతో బాటు మరో నలుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

# జుట్టు మొలిపిస్తామని.. ముంచేశారు



**కాకినాడలో ఓ సంస్థ మోసంపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు**

**రూ.90 వేలు కట్టించుకోవడంతో పాటు టెస్టులతో తొమ్మిది నెలలుగా తాత్సారం**

**ఉన్న జుట్టు కూడా కట్ చేయించిన వైనం**

%కాకినాడ క్రైం,ఆగస్టు 8(టుడే విదుర):మీ తలపై జుట్టు లేదా.. అయితే మా దగ్గరకు రండి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి జుట్టు మొలిపిస్తాం..' అంటూ ఓ సంస్థ ప్రకటన చూసి మోసపోయాడో వ్యక్తి! ఈ ఘటనకు సంబంధించి కాకినాడ టూటౌన్ పోలీసస్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా వున్నాయి... తలపై జుట్టులేని చోట ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో జుట్టు రప్పిస్తామనే ఒక ప్రకటనను చూసిన కాకినాడకు చెందిన కె.సురేష్.. నగరంలోని శ్రీనగర్ సీతాపతి స్వప్నసౌధ అపార్ట్‌మెంట్‌లో ఉన్న వీఆర్ఎస్ హెయిర్ క్రియేషన్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ నిర్వాహకులు తమవద్ద 9 నెలల ట్రీట్‌మెంట్ ఉంటుందని, రూ.98వేల ప్యాకేజీతో తలపై మెండుగా జుట్టు రప్పిస్తామని చెప్పారు. సురేష్ దగ్గర రూ.10వేలతో పాటు వారే రూ.80వేలు ప్రైవేటు ఫైనాన్స్ చేయించి సంస్థకు జమ చేయించారు. సుమారు 9నెలల నుంచి ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి, టెస్టులు చేయించుకుని రమ్మంటూ కాలయాపన చేశారని బాధితుడు పేర్కొన్నారు. వెళ్లిన ప్రతిసారీ టెస్టులకు రూ.3వేల నుంచి రూ.4వేల ఖర్చయ్యేదని తెలిపారు. ఈ నెల 5న ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పి.. తలపై ఉన్న మొత్తం జుట్టును ఒడిసా నుంచి తీసుకొచ్చిన బార్బర్లతో తీయించాడని వాపోయాడు. ఇంటి నుంచి బయటకు రావడానికి మానసిక క్షోభ అనుభవిస్తున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ట్రీట్‌వెంట్ చేయకుండా షుగరు, బీపీ ఉందని తాత్సారం చేస్తుండడంతో గత్యంతరం లేక పోలీసులను ఆశ్రయించానన్నారు.

# నూజివీడు అభివృద్ధికి రూ.30 కోట్లు

లనూజివీడుఆగస్టు 8(టుడే విదుర): నూజివీడు నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పను లకు రూ.30 కోట్లు మంజూరయ్యాయని మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాలువలు, చెరువు పనులకు రూ.22 కోట్లు, నూజి వీడు పట్టణా భివృద్ధికి రూ.5 కోట్లు, బలివే ఆలయ అభివృద్ధికి రెండున్నర కోట్లు మంజూరయ్యా యన్నారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్‌కెనాల్ పనులు నవంబర్‌లో పూర్తి అవుతాయని, రైట్ మెయిన్ కెనాల్ పనులు 2027కి పూర్తి చేస్తారని తెలిపారు. చింతలపూడి పథకానికి అడ్డంకిగా ఉన్న లీగల్ సమస్యలను త్వరలో తొలగించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయటానికి పనులు జరుగుతున్నాయన్నారు. కృష్ణానది నుంచి వృ?థాగా సముద్రంలో కలుస్తున్న జలాలను వాటా లేకపోయినా ఏపీలోని పంట సాగుకు అనుమతి కోరగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎన్ఆర్ ఈజీఎస్ పనుల బిల్లులు చెల్లించలేదని, వాటి కోసం ఈనెల 11వ తేదీలోపు బిల్లులు ఆన్‌లైన్ చేసుకోవాలని నెలాఖరుకు బిల్లులు చెల్లిస్తామని మంత్రి అన్నారు. గతంలో అర్బన్ , రూరల్ పరిధిలో నిర్మించిన గృహాలకు కొన్ని సమస్యల కారణంగా బిల్లులు చెల్లింపు జరగలేదని కేంద్రమంత్రితో మాట్లాడి త్వరలో బిల్లులు జమ చేస్తామన్నారు.

# ఆరు కుంకీలతో ఆపరేషన్



బంగారుపాళ్యం,ఆగస్టు 8(టుడే విదుర): పంటపొలాలపై దాడులు చేస్తున్న ఏనుగుల ఆట కట్టించేందుకు మరోసారి కుంకీలను అటవీప్రాంతానికి తరలించారు.గురువారం సాయంత్రం బంగారుపాళ్యం మండలంలోని కీరమంద,కొదలమడుగు అటవీ పరిసర ప్రాంతాలకు ఆరు కుంకీ ఏనుగులను తరలించారు.వీటిలో కర్ణాటక రాష్ట్రం నుంచి రప్పించిన రంజన్,దేవ,అభిమన్య,కృష్ణతో పాటు రామకుప్పం మండలం ననియాల తాండా శిబిరం నుంచి తీసుకొచ్చిన వినాయకం,జయంత్ ఏనుగులున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు సంచరిస్తున్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు ఈ ఆపరేషన్ మొదలుపెట్టారు.పలమనేరు సబ్ డీఎఫవో వేణుగోపాల్ ఆధ్వర్యంలో 12మంది మావటీలు,40 మంది అటవీశాఖ సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌ను డీఎఫవో భరణి రాత్రి కీరమంద అటవీప్రాంతానికి చేరుకుని పర్యవేక్షించారు.

# వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ




హిందూపురం ఆగస్టు 8(టుడే విదుర): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు హిందూపురం పురపాలక సంఘం పరిధిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా, సెర్ప్ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో 100 అడుగులతో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కార్యాలయం నుండి మున్సిపల్ చైర్మన్ డి.ఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 వ తేదీన ప్రతి ఇంటి పైన జాతీయ పతాకాన్ని ఎగరవేసి, దేశ సమైక్యతను, సమగ్రతను చాటుకోవాలని, దేశాభిమానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఎంసి ఎల్.గంగులయ్య, సెర్ప్ ఎ.పి.యం. జి.రామాంజినేయులు, సి.ఓ.లు తౌసిఫ్, నాగేంద్ర, సదానంద, వరలక్ష్మి గంగరత్న, డి.ఈ.ఓ. ఇబ్రహీం ఖాన్, పట్టణ సమాఖ్య ఓ.బి.లు, అన్ని సమాఖ్యల ఆర్.పి.లు, సెర్ప్ విఒఎలు పాల్గొన్నారు.

# అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి



ఓబుళదేవర చెరువు ఆగస్టు 8(టుడే విదుర): అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్ లోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు గ్రాడ్యుటి సౌకర్యం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోషన్ కల్పించే జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ఈసందర్భంగా నూతన ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మణిమాల, ప్రధాన కార్యదర్శిగా రంగమ్మ, మినీ అంగనవాడి యూనియన్ లీడర్‌గా భారతి ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ ,స్వర్ణ, సరళ, సునీత భారు, షమీం తదితరులు పాల్గొన్నారు. కదిరి టౌన్ : అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కదిరి పట్టణం పులివెందుల రోడ్ లోని అంగన్వాడీ ప్రాజెక్టు లో అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత వైసిపి ప్రభుత్వంలో అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేశారని గుర్తు చేశారు. ఈ సమ్మెలో భాగంగా అప్పటి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. గత ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తి అవుతున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని అంగన్వాడీల వేతనాలు పెంచాలన్నారు. అదేవిధంగా కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2జి ఫోన్లు ఇచ్చి రకరకాల యాప్ ల పేరుతో ఇబ్బందులకు గురవుతున్నారాని ఈ ఫోన్లతో విసిగిచెంది అంగన్వాడీలు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పారని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన ట్యాబ్లు ఇవ్వాలని అన్ని సేవలకు సంబంధించి ఒకే యాప్ ను రూపొందించాలని కోరారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యల పరిష్కరించాలని లేకపోతే భవిష్యత్తులో సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు , అంగనవాడీ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, మాబున్నీసా, శ్రీదేవి, సుశీల, సుజాత, రామలక్ష్మి, వకుల, మాధవి , సిఐటియు నాయకులు జగన్మోహన్ , బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

# మహోన్నత పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు




%కర్నూలు కల్చరల్,ఆగస్టు 8(టుడే విదుర): మహోన్నత పాలకుడు శ్రీకృష్ణ దేవరాయలు అని నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు, కళారత్న పత్తి ఓబులయ్య కొనియాడారు. కృష్ణరాయల 516వ పట్టాభిషేక దినోత్సవం సందర్భం గా నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో నగరం లోని కిసానఘాట్ వద్ద గల శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాష మాధుర్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకే దక్కుతుందని శ్లాఘించారు. నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్ మాట్లా డుతూ శ్రీకృష్ణ దేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించి, ఆయన చేసిన మంచి పనులును నేటి తరం ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సంఘం ప్రధాన సలహాదారు డాక్టర్ సింగంశెట్టి సోమ శేఖర్ మా ట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవులు బలిజ లకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాస మూర్తి, శేలేష్, కార్పొరేటర్ స్వామిరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ పవనకు మార్, విజయ్‌కుమార్, విజయభాస్కర్, కిరణ్మయి, ప్రకాశబాబు, ఆంజనే యులు, చలపతి, ఈరన్న, శ్రీనివాస్, శ్రీకాంత పాల్గొన్నారు.

# తాగేది ఎలా..?




ఆగస్టు 8(టుడే విదుర):మున్సిపాలిటీ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు ఆకు పసరు రంగులో వచ్చింది. బ్రౌన్ పేట, కుమ్మర వీధి కొత్తపేట, 6వ వార్డు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా ఆకు పసరు రంగులోనే నీరు సరఫరా అవుతోంది. ఇలాంటి నీటిని ఎలా తాగాలని, ఈ నీటితో వంట, స్నానాలు ఎలా చేయాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెండు రోజులుగా ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కారణాలు పరిశీలిస్తున్నాం కుళాయిల్లో ఆకు పసరు రంగులో నీరు రావడానికి గల కారణాలను పరిశీలిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య అన్నారు. స్థానిక బడేలమ్మ చేరువులో చేపల వేట కోసం నీటిని మోటారు సహాయంతో బయటకు పంపిస్తుండగా ఆ జలాలు పైపులైన్ల లీకుల ద్వారా కుళాయిల్లోకి వస్తున్నట్టు అనుమానంతో తమ సిబ్బందితో లీకులు గుర్తించే చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. బడేలమ్మ చెరువులో జలాలు బాగా ఆకు పసరుగా ఉన్నందున అవే కలుషితం అయ్యే అవకాశం ఉన్నట్టు ఆమె చెప్పారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు ఈ పరిస్థితి లేదని, కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సమస్య ఉన్నందున పరిస్థితి చక్కదిద్దనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం బడేలమ్మ చెరువులో నీటిని బయటకు పంపింగ్ చేసే ప్రక్రియను తాత్కాలికంగా నిలిపి వేసినట్టు ఆమె తెలిపారు.

# పాముకాటుతో వ్యక్తి మృతి



ఆగస్టు 8(టుడే విదుర):ముసునూరు పాము కాటుకు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం%ౌ% మండలంలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురం గ్రామానికి చెందిన చందమాల గాబ్రియేలు (45) సాయంత్రం వ్యవసాయ కూలీ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్లగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించిమృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# చేపలు మృత్యువాత



ఆగస్టు 8(టుడే విదుర):మండలంలోని దొడ్డ నపూడి గ్రామ రెవెన్యూ పరిధిలో గల చేపల చెరువులో వందల సంఖ్యలో చేపలు మృతిచెందాయి. దీంతో ఆ చెరువును లీజు తీసుకుని, చేపలు పెంచుతున్న కాళ్ల గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ లబోదిబోమంటున్నారు. చేపలు తేలిపోవడంతో చేపలను గట్లపై పూడ్చి వేస్తున్నారు. 100 టన్నుల చేపలు చనిపోయాయిపి.సత్యనారాయణ, ఆక్వా రైతు, కాళ్లదొడ్డనపూడి గ్రామంలో 75 ఎకరాల చేపల చెరువులు సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుతం కేజీ చేప ధర రూ.118 ఉంది. కేజీన్నర, రెండు కేజీల చేపలు ఆకస్మాత్తుగా చేపల చెరువులో సుమారు 100 టన్నుల చేపలు చనిపోయాయి. వాటి విలువ రూ.కోటి 50 లక్షలు ఉంటాయి. వాతావరణం తేడా అనుకుంటే చుట్టుపక్కల చెరువులు బాగానే ఉన్నాయి. విషయం ఏమిటో అర్థం కావడం లేదు. మత్స్యశాఖ అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.చేపలకు వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలిఎం.ఇందిర ప్రియదర్శిని, మత్స్యశాఖ అధికారిణి, కాళ్లచెరువులోని నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గడం, పిహెచ్ స్థాయి మారడం వల్ల చేపల మరణానికి దారితీస్తాయి. ముఖ్యంగా ఎక్కువ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు నీటిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. దీనివల్ల చేపలు ఊపిరాడక చనిపోతాయి. కొన్ని రకాల వ్యాధులు చేపలకు సోకినప్పుడు అవి మరణిస్తాయి.

# బీసీలపై కక్ష సాధింపు చర్యలు తగవు



నంద్యాల రూరల్, ఆగస్టు 8(టుడే విదుర): బీసీలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు తగవని వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్ నాయుడు అన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలపై దాడులు ఆపకపోతే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి డిపాజిట్లు కూడా దక్కవని అన్నారు. బీసీలకు రక్షణ కరవైందని ఆరోపించారు. ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్‌పై దాడికి నిరసనగా నంద్యాలలో నిరసన తెలిపినట్లు తెలిపారు. నాయకులపై కక్ష సాధింపు చర్యలు మంచిది కాదన్నారు. బీసీ నాయకులు పుల్లయ్య, చిన్నబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

# 176మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు



పార్వతీపురం ఆగస్టు 8(టుడే విదుర): స్థానిక జిల్లా కేంద్రాస్పత్రిలో నిర్వహించిన కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంలో 176మంది పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి డాక్టర్ నాగభూషణరావు ప్రారంభించారు. 65మందికి నోటికి సంబంధించిన కేన్సర్ పరీక్షలు నిర్వహించగా నలుగురు అనుమానితులుగా, ఒకరికి నాలుక కేన్సర్‌గా నిర్ధారించారు. బ్రెస్ట్ కేన్సర్‌కు సంబంధించి 91మందికి పరీక్షలు నిర్వహించగా 20మందిని అనుమానితులు గా నిర్ధారించారు. వీరికి డిజిటల్ మెమోగ్రఫీ పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరికీ కేన్సర్ నిర్ధారణ కాలేదు. మరో 20మందికి గర్భసంచి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా పదిమందిని అనుమానితులుగా నిర్ధారించారు. వీరికి ప్యాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. వారం రోజుల్లో వీరి రిపోర్టులు రానున్నాయని వైద్యులు తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివనాగజ్యోతి పర్యవేక్షణలో నిర్వహించిన వైద్యశిబిరంలో దంత వైద్యులు డాక్టర్ హారిక, డాక్టర్ కె.పాల్,మెమోగ్రఫీ టెక్నీషియన్స్ లక్ష్మీ, సుమన్, జిల్లా కేంద్ర ఆసుపత్రి దంత వైద్యులు డాక్టర్ దినేష్ కుమార్, డాక్టర్ శ్యామల పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు: డీజీపీ



అమరావతి, ఆగస్టు 8(టుడే విదుర): విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో గంజాయి, డ్రగ్స్, సిగరెట్లు, గుట్కా, కాఫ్ సిర్ఫ్‌లు విక్రయించరాదన్న టోఫెల్ మార్గదర్శకాలను రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో గత నెల 8 నుంచి 12 వరకూ 26 జిల్లాల్లో చేపట్టిన దాడుల్లో.. 16,806 దుకాణాలను తనిఖీ చేశామని, 25,807 కేసులు నమోదు చేసి రూ.40.62 లక్షల మేర జరిమానా విధించినట్లు వెల్లడించారు. విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఎక్కువ కేసులు నమోదు కాగా.. పశ్చిమ గోదావరి, కడప, అన్నమయ్య జిల్లాల్లో తక్కువ నమోదైనట్లు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడం శుభ పరిణామమన్నారు. విద్యార్థులు ఎవ్వరూ మత్తు బారిన పడకుండా జిల్లాల ఎస్పీలతో ఈగల్ విభాగం సమన్వయం చేసుకుని చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమచారాన్ని తెలియజేయాలని ప్రజలను డీజీపీ కోరారు.

# బియ్యం.. బొక్కేస్తున్నారు..

- పక్కదారి పడుతున్న పీడీఎస్ బియ్యం
- కొందరు డీలర్ల నుంచే నేరుగా వ్యాపారులకు..
- కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయం
- తేటతెల్లం చేస్తున్న బఫర్ లెక్కలు
- ఒక్కో షాపు నుంచి ప్రతినెలా 20 సంచుల వరకు..



అనంతపురం ఆగస్టు 8(టుడే విదుర): పేద ప్రజల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని బొక్కేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ(పీడీఎస)లో ఏకంగా బియ్యం సంచులే మాయమవుతున్నాయి. నేరుగా వ్యాపారులకు బియ్యం చేరుతోందనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అందుకు ఎఫ్‌పీ షాపుల్లో కనిపిస్తున్న బఫర్ స్టాకే నిదర్శనం. కొన్ని దుకాణాల్లో పదుల సంఖ్యలో బియ్యం బస్తాల కొరత కనిపిస్తోంది. పేదల బియ్యం ద్వారా డబ్బు దోచుకునే వ్యవహారం గత వైసీపీ హయాంలో జోరుగా సాగింది. కూటమి ప్రభుత్వంలోనూ కొందరు డీలర్లు కొనసాగిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు మాత్రం ముడుపులతో చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ప్రజలకు అందాల్సిన బియ్యం కొందరు అక్రమార్కుల పాలవుతోంది. ఈ దందా జిల్లా కేంద్రమైన అనంతపురంతోపాటు పట్టణాల్లోనే ఎక్కువగా సాగుతోంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లోనూ పెద్దఎత్తున పక్కదారి పట్టిస్తున్నట్లు తెలుస్తోంది.

# బ్రెయిన్ డెడ్ వ్యక్తి అవయవదానం

బ్రెయిన్ డెడ్ అయిన బలరామకృష్ణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యులు




–గుంటూరు జిల్లా ప్రతినిధి ఆగస్టు 8(టుడే విదుర): గుంటూరులో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి చెందిన అవయవాలను దానం చేయడం ద్వారా ఏడుగురికి ప్రాణదానం చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లో ఉంటున్న 59 ఏళ్ల కనగాల బలరామకష్ణ ఈనెల 3వ తేదీన స్థానిక గుజ్జనగుండ్ల నుండి పట్టాభిపురం వైపు సైకిల్‌పై వెళుతుండగా కారు ఢకొని తలకు తీవ్ర గాయమైంది. ఆయన్ను స్థానిక ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స అందిస్తూ బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. అతని కుటుంబీకులకు ఈ విషయాన్ని చికిత్సను అందిస్తున్న న్యూరాలజి చీఫ్ డాక్టర్ కుమారవేల్ వివరించారు. డాక్టర్ల సూచనల మేరకు జీవన్ దాన్ ట్రస్ట్ ద్వారా అవయవదానం చేసేందుకు కుటుంబీకులు ముందుకొచ్చారు. ఏడుగురు వ్యక్తులకు శరీరంలోని ఏడు కీలక అవయావాలను పంపేందుకు ఆస్పత్రి నిర్వాహకులు గ్రీన్ ఛానల్ ద్వారా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌కు జీవన్ దాన్ ట్రస్ట్ తరుపున గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ మట్టిలో కలిసి పోయే ఈ శరీరం మరో 10 మందికి ప్రాణాలు పోస్తుందని గ్రహించాలని అపోహలు వీడి ప్రతి ఒక్కరు జీవన్దాన్ లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. డాక్టర్ రాయపాటి మమత, కనగాల అనూష తదితరులు పాల్గొన్నారు.

# పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



తిరుమల, ఆగస్టు 8(టుడే విదుర): తిరుమలలో పవిత్ర పూర్ణాహుతితో మూడురోజుల పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం యాగశాలలో ఋత్వికులు హోమాలను నిర్వహించారు. మధ్యా హ్నం ఒంటి గంటకు విశేష సమర్పణ, 4 గంటలకు ఉత్సవమూర్తుల ఊరేగింపు జరిగాయి. రాత్రి 7 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీమలయప్పస్వామి శ్రీదేవి, భూదేవిలతో కూడి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం, పేష్కార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



వల్లూరు (కడప) ఆగస్టు 8(టుడే విదుర): కడప తాడిపత్రి జాతీయ ప్రధాన రహదారి గోటూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం పొద్దుటూరు నుంచి కడపకు వస్తున్న బస్సు వెనుక వైపు బైక్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు సడన్గా బ్రేక్ వేయడంతో ఘటన జరిగినట్లు అక్కడున్న స్థానికుల సమాచారం గాయాలైన వ్యక్తి గంగయ్య పల్లెకు చెందిన దుగ్గన్న గారి శ్రీనివాసులరెడ్డి గుర్తించారు. తలకు తీవ్ర గాయాలైన శ్రీనివాసుల రెడ్డిని సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనం ద్వారా కడప రిమ్స్ కు తరలించారు.

# వాసవి మాతకు సారె సమర్పణ





విజయనగరం టౌన్ :ఆగస్టు 8(టుడే విదుర): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాలు ప్రకారం శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా వాసవి క్లబ్ విజయనగరం అధ్యక్షులు విజ్జపు విజరు ఆధ్వర్యంలో 'చీర సారె' కార్యక్రమం నిర్వహించడం జరిగింది. శుక్రవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం కు పట్టు వస్త్రాలు, 52 రకాల పిండి వంటలతో సారె సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజ్జపు విజయ్ మాట్లాడుతూ లోకకళ్యాణర్థం ప్రజలు సిరిసంపదలతో తులతుగాలని వాసవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు చెప్పారు. కేబినెట్ సెక్రటరీ(అడ్మిన్) ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ నిరంతరం సమాజసేవా కార్యక్రమంలు చేపడుతుండడం వాసవి క్లబ్ ముఖ్య ఉద్దేశ్యం అని, త్వరలో పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.వి. కృష్ణారావు,మాచర్ల చంద్రశేఖర గుప్త,డిమ్స్ రాజు,కట్టామూరి శంకర్రావు, గుడిశా వినోద్, ప్రాజెక్ట్ చైర్మన్ రత్నారావు,రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు,క్లబ్ కార్యాదర్శి నానాజీ, కోశాధికారి కఅష్ణారావు, కుమార్, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో సరికొత్త సేవలు..
## ఇంటి వద్దనే ఎఫ్ఐఆర్



హైదరాబాద్:ఆగస్టు 8(టుడే విదుర): ప్రజలకు మరింత చేరువ కావాలనే లక్ష్యంతో సైబరాబాద్ కమిషనరేట్ పోలీసులు సరికొత్త సేవలను ప్రారంభించారు. బాలానగర్ పీఎస్ పరిధిలో ఫిర్యాదు దారుల ఇంటివద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బాలానగర్ ఎస్‌హెచ్‌వో నరసింహరాజు, ఎస్ఐలు సరితాపటేల్ రెడ్డి, వినోద్ హనుమాన్ దేవాలయం, పట్వారి ఎన్‌క్లేవ్, కామాక్షి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌ల వద్దకు వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు ఫిర్యాదు దారుల ఇళ్ల వద్దకు రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. %పోలీసులపై నమ్మకం కలిగేలా చర్యలు పోలీసులపై మరింత నమ్మకం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి ఫిర్యాదులు తీసుకోవడంతోపాటు కాపీని వారికి అందజేస్తాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

# ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు
## అరుదైన గుర్తింపు




హైదరాబాద్ సిటీ,ఆగస్టు 8(టుడే విదుర): ప్రపంచంలోనే.. కార్నియల్ న్యూరోటైజేషన్ శస్త్రచికిత్స నిర్వహించే అగ్రగామి కంటి చికిత్స కేంద్రాల్లో ఒకటిగా ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్(ఎల్వీపీఈఐ)కు గుర్తింపు దక్కింది. 2019 నుంచి ఇప్పటిదాకా ఎల్వీపీఈఐ ఈ తరహా శస్త్రచికిత్సలు 40కి పైగా చేసి అత్యుత్తమ ఫలితాలు నమోదుచేసింది. ఈ విషయాన్ని ఆ సంస్థ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. గట్టిగా గాలి వీచి దుమ్ము లేస్తే.. అసంకల్పితన ప్రతీకారచర్యగా మనం కనురెప్పలు ఆడిస్తాం. కంట్లో ఏదైనా నలుసు పడితే.. వెంటనే కళ్లల్లో నీరు వచ్చి దాన్ని బయటకు నెట్టాలని ప్రయత్నిస్తుంది. కార్నియాకు సహజంగా ఉండే సెన్సేషన్ (స్పర్శ, నొప్పి, ఉష్ణోగ్రత వంటివాటిని గుర్తించే సామర్థ్యం) కారణంగా ఈ చర్యలన్నీ జరుగుతాయి. పుట్టుకతో వచ్చే సమస్యల కారణంగాగానీ, న్యూరోసర్జరీ సమయంలో నాడులు దెబ్బతిన్నప్పుడుగానీ.. కార్నియాకు ఉండే ఆ సహజ సామర్థ్యం పోతుంది. అలాంటి సందర్భాల్లో.. నుదురు, కాలు వంటి ఇతర భాగాల నుంచి ఆరోగ్యవంతమైన సెన్సరీ నాడులను మైక్రో సర్జరీ ద్వారా కార్నియా సమీపంలో అతికిస్తారు. కొన్ని నెలల వ్యవధిలో అవి పెరిగి కార్నియా సెన్సేషన్‌ను పునరుద్ధరిస్తాయి. ఈ ప్రక్రియ కంటికి సాంత్వన కలిగించడమే కాక, దృష్టిని కాపాడడంలో కూడా సహాయపడుతుందని ఎల్వీపీఈఐ వైద్యులు తెలిపారు. ఈ ఆధునిక పరికరాలు చాలా కేంద్రాల్లో లభించవని.. పిల్లలు, పెద్దలకు వచ్చే న్యూరోట్రోఫిక్ కెరటిటిస్ చికిత్సలో ఏల్వీపీఈఐకి విశేష అనుభవం ఉందని వారు వివరించారు. ఇప్పటి వరకూ తాము నిర్వహించిన ఈ తరహా శస్త్రచికిత్సల ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయని వెల్లడించారు.

# గుండెపోటుతో
## తహసీల్దార్ మృతి



నెన్నెలఆగస్టు 8(టుడే విదుర): నెన్నెల తహసీల్దార్ ముదమల్ల జ్యోతి ప్రియదర్శిని (50) రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె స్వస్థలం జగిత్యాల కాగా ఒంటరిగా సీసీసీ నస్పూర్‌లో నివాసం ఉంటు న్నారు. మంగళవారం నెన్నెలలో విధులు ముగించుకొని సీసీసీలోని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి తనకు చాతిలో నొప్పి వస్తోందని ఆసుపత్రికి వెళ్లేందుకు వెంటనే ఇంటికి రావా లని తన కారు డ్రైవర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. డ్రైవర్ ఇంటికి వచ్చి చూసే సరికి అపస్మారకస్థితిలో పడిపోయి ఉన్నారు. పొరుగువారి సహకారంతో ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని ధ్రువీకరించారు. కోటపల్లి, చెన్నూరు మండలాల్లో తహసీల్దార్‌గా, బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా సేవలదించిన జ్యోతి ప్రియదర్శిని గత నెల 9న బదిలీపై నెన్నెలకు వచ్చారు. అనతి కాలంలోనే ప్రజలు, అధికారుల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. మంగళవారం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనులు చేసి పెట్టాలని సూచించారు. ఆమె మాట్లాడిన ఆఖరు మాటలను సిబ్బంది మననం చేసుకున్నారు. ప్రజాసేవ కోసం తమ తహసీల్దార్ తపించేవార ని సిబ్బంది పేర్కొన్నారు. అధికారులు, నాయకులు ఆమె పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. జగిత్యాలలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

# రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం..
## బోగిలో చెలరేగిన మంటలు



ఆగస్టు 8(టుడే విదుర):మహబూబాబాద్ కేసముద్రం రైల్వే స్టేషన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మొబైల్ రెస్ట్ బోగిలో మంటలు చెలరేగాయి. ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. డోర్నకల్-కాజీపేట మధ్య 3వ రైలు నిర్మాణ పనులు జరుగుతున్న సంగతి తెలిసిందే. నిర్మాణ పనుల్లో భాగమైన ఉద్యోగుల కోసం కేసముద్రం రైల్వే స్టేషన్‌లో మొబైల్ బోగిని ఏర్పాటు చేశారు. మొబైల్ రెస్ట్ బోగి లూప్‌లైన్‌లో నిలిచి ఉంది. ఏమైందో ఏమో తెలీదు కానీ, ప్రమాదవశాత్తు బోగిలో మంటలు చెలరేగాయి.మంటలు అంటుకున్న సమయంలో బోగిలో ముగ్గురు ఉద్యోగులు ఉన్నారు. మంటల్ని గమనించిన వారు వెంటనే బయటకు వచ్చారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. ఒక వేళ ఈ సంఘటన అర్ధరాత్రి వారు నిద్రమత్తులో ఉన్నపుడు జరిగి ఉన్నా.. డోరు సరైన సమయానికి ఓపెన్ కాకపోయి ఉన్నా పెను విషాదం చోటుచేసుకుని ఉండేది. సరైన సమయంలో అగ్ని ప్రమాదాన్ని గుర్తించి వారు బయటపడ్డారు. ఇక, మంటల్లో ఆ బోగి కాలిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. సంఘటనపై విచారణ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో రైలులు తరచుగా అగ్ని ప్రమాదానికి గురవుతూ ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం తిరుపతి రైల్వే యార్డులో అగ్ని ప్రమాదం సంభవించింది. హిస్సార్-తిరుపతి మధ్య నడిచే వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును చింతలచేను సమీపంలో పార్కింగ్ చేస్తుండగా చివరి నుంచి రెండో బోగీలో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటి తర్వాత పక్కనే నిలిచి ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జనరేటర్ బోగికి కూడా మంటలు వ్యాపించాయి. దాని పెయింట్ కాలిపోయింది. హిస్సార్-తిరుపతి రైలు బోగి పూర్తిగా కాలిపోయింది.

# నగరంలో వర్ష బీభత్సం..
## మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు అలర్ట్



ఆగస్టు 8(టుడే విదుర):)రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల వర్షం దంచి కొట్టింది. హైదరాబాద్ నగరంలో నిన్న సాయంత్రం మొదలైన వర్షం అర్ధరాత్రి వరకు పడింది. కుండపోత వర్షం కావటంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల వర్షపు నీరు ఇళ్లలోకి వచ్చింది. రోడ్లపై సైతం భారీ ట్రాఫిక్ జామ్ అయింది. ఇక, భారీ వర్షాలతో హిమాయత్ సాగర్‌కు పెద్ద ఎత్తున వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలోనే అధికారులు హిమాయత్ సాగర్ గేట్లు తెరవనున్నారు. నీటిని దిగువన ఉన్న మూసీలోకి విడుదల చేయనున్నారు. దీంతో మూసీ పరివావర్ష బీభత్సం కారణంగా హైదరాబాద్ నగరంలోని మణికొండ మున్సిపాలిటీలో పలు కాలనీలు నీట మునిగాయి. సాయంత్రం నుంచి కురిసిన వర్షానికి సెల్లార్లలోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. సెల్లార్లలోని వాహనాలు నీట మునిగిపోయాయి. సమాచారం అందుకున్న మణికొండ మున్సిపల్ కమిషనర్ స్పాట్‌కు చేరుకున్నారు. సెల్లార్లలోని నీటిని క్లియర్ చేయించారు. రోడ్లకు గండి కొట్టి, మోటార్లతో సెల్లార్లలోని వర్షపు నీటిని క్లియర్ చేశారు. ఇక, వర్షాల కారణంగా కైరా స్కూలు సమీపంలోని ఓ ఇళ్లు కూలిపోయింది.

# ఉచిత టాయిలెట్ల వద్ద డబ్బులు వసూలు

అలంపూర్ ఆగస్టు 8(టుడే విదుర):అలంపూర్‌లోని ఐదవశక్తి పీఠం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో ఉన్న ఉచిత మూత్రశాలలు, మరుగుదొడ్లు ప్ర స్తుతం వినియోగంలోకి వచ్చాయి. గతంలో ఉ న్న వాటిని ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ వారు తొలగించి, అక్కడే కొత్తవి నిర్మించారు. దేవస్థా నం వారికి అప్పగించారు. గతంలో వేలంపాట లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణను దక్కించుకున్న వారు, ప్రస్తుతం కొత్త మరుగు దొడ్ల వద్ద వినియోగదారుల నుంచి రూ.10 - రూ.15 వరకు బోర్డుపెట్టి మరీ వసూలు చేస్తు న్నారు. ఈ విషయాన్ని చూసి కొందరు భక్తులు ఆలయాలకు వచ్చిన భక్తులతో ఇలా అధిక డ బ్బులు వసూలు చేయడం తగదని అంటున్నా రు. ఈ విషయమై ఆలయ ఈవో పురేందర్‌కు మార్‌ను సంప్రదించగా మూత్రశాలల విష యం తమదృష్టికి రాలేదని, వెంటనే పరిశీలించి తగుచర్యలు తీసుకుంటానని తెలిపారు.

# మూడు రోజుల బాబుకు అరుదైన శస్త్ర చికిత్స..
## వైద్యులకు కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు




కంటేశ్వర్ ఆగస్టు 8(టుడే విదుర):నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ ఆసుపత్రిలో మూడు రోజుల మగ శిశువుకు అరుదైన లేపరోటమి కోలస్టమి శస్త్ర చికిత్స ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దేవేందర్ ఆసుపత్రి ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. %ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లి ఇబ్రహీంపట్నంకు చెందిన గంగా ప్రవళిక గత నెల జులై 25 న డెలివరీ అయిన తర్వాత పుట్టిన బాబుకు మల విసర్జన( మోషన్) రాకపోవడంతో జులై 28న జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ హాస్పిటల్‌కు తీసుకువచ్చినట్టు వివరించారు. బాబుకు అన్ని రకాల పరీక్షలు చేశాక ఇంతస్టైనల్ అబ్స్ట్రక్షన్ చిన్న పేగులో దూరడంతో కడుపులో నొప్పితో పాటు యూరిన్, స్టోల్ సమస్య ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వైద్యుల బృందం లాపరోటమీ అనే సాధారణ చికిత్స విధానం ద్వారా ఉదర అవయవాలను పరిశీలిస్తూ కొలోస్టమీ అనే నిర్దిష్ట రకమైన స్టోమా శస్త్ర చికిత్స ద్వారా మలం బయటకు వెళ్లడానికి పెద్దప్రేగులో ఓపెనింగ్ (స్టోమా)ను సృష్టించి విజయవంతంగా ఆపరేషన్ పూర్తి చేసినట్టు తెలిపారు.ఆస్పత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ , ఆపరేషన్ హెడ్ హరికృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఉన్నతమైన వైద్యం అందించే లక్ష్యంగానే నిజామాబాదులో వెల్‌నెస్ హాస్పిటల్ ఏడవ బ్రాంచ్‌ను ప్రారంభించామని తెలిపారు. తమ హాస్పిటల్ వైద్యులు 24/7 అందుబాటులో ఉంటారని ఏ సమయంలో వచ్చిన ఎటువంటి సమస్యకైనా అవసరమైన అత్యవసర చికిత్స అందిస్తామని తెలిపారు.అతి తక్కువ ఖర్చుతోనే హైదరాబాద్ వెళ్లకుండా నిజామాబాదులోనే పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు ఆసుపత్రి సిద్ధంగా ఉ ందని, జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు.

# టుడే వినోదం



## సుధీర్‌బాబు జటాధర.. టీజర్ వదిలిన ప్రభాస్





సుధీర్ బాబు , బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలు పోషిస్తున్న మైథలాజికల్ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'( దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇటీవలే ఈ మూవీ నుంచి పోస్టర్ రిలీజ్ చేసి మంచి స్పందనను రాబట్టుకున్న మేకర్స్ తాజాగా శుక్రవారం ఈ మూవీ టీజర్‌ను ప్రభాస్ తన ఇన్ స్టా స్టోరీ ద్వారా రిలీజ్ చేసి సుధీర్ బాబు, సోనాక్షి, మూవీ టీకు అల్ ది బెస్ట్ చెప్పారు. %వెంకట్ కల్యాణ్ , అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో అద్భుతమైన గ్రాఫిక్స్‌తో విజువల్ వండర్‌గా తీర్చిదిద్దినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. సంస్కృత శ్లోకం బ్యాగ్రౌండ్‌లో వినిపిస్తోండగా ఓ మారుమూల రహస్య ప్రాంతంలో భారీ నిధి నిక్షేపాలు ఉండడం, వాటికి కాపాలా అన్నట్టు వంటి నిండా ధగధగలాడే అభరణాలతో సోనాక్షి అక్కడ కాచుకుని కూర్చుని ఉండడం, అప్పుడే సుధీర్ బాబు ఓ త్రిశూలంతో అక్కడ అడుగు పెట్టి వారిద్దరు పోరాడే దృశ్యాలతో టీజర్ ఆసక్తికరంగా సాగింది. ఈ టీజర్ చూసిన వారంతా సుధీర్ బాబు ఈ సారి ఏదో గట్టిగానే ప్లాన్ చేసినట్లుగా తెలుస్తోంది. అలాగే తెలుగులోకి ఫస్ట్ టైం ఎంట్రీ ఇస్తున్న సోనాక్షి లుక్ ఫెరోసియస్‌గా చంద్రముఖి సినిమాలో జ్యోతికను తలపించేలా ఉందంటూ నెటిజన్లు పెస్టులు పెడుతున్నారు. టీజర్ బావుందని సినిమా త్వరగా చూడాలి అనేలా ఉందని, త్వరగా రిలీజ్ చేయండి అంటూ మరి కొంతమంది ట్వీట్లు పెడుతున్నారు. పైగా ప్రభాస్ స్వయంగా తన ఇన్ స్టాలో రిలీజ్ చేయడంతో ప్రభాస్ ఫ్యాన్స్ తెగ చూస్తు టీజర్‌ను వైరల్ చేస్తున్నారు.

## అవార్డుల విలువ తగ్గించినట్లే..!



%ఇటీవల ప్రకటించిన జాతీయ చలనచిత్ర అవార్డులపై మలయాళ దర్శకుడు జెయో బేబీ స్పందించారు. ఆదా శర్మ కీలక పాత్రలో నటించిన ది కేరళ స్టోరీ చిత్రానికి రెండు అవార్డులు రావడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ది కేరళ స్టోరీ' చిత్రం వాస్తవాలను తప్పుగా చూపించడమే కాకుండా.. స్క్రిప్ట్, దర్శకత్వం, నటన జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రమాణాలకు అనుగుణంగా లేవని ఆయన విమర్శించారు. ఇలాంటి సినిమాలకు అవార్డుల ప్రకటించడం వాటి విలువను తగ్గించనట్లే అవుతుందని అన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఆయన ఈవిధంగా మాట్లాడారు. 'కేంద్రంలోని అధికార పార్టీ ఎజెండాకు మద్దతు ఇచ్చే చిత్రాలకు జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారు. గత పదేళ్లుగా మనం ఈ పద్ధతిని చూస్తున్నాం. ఇలాంటి స్క్రిప్ట్‌లను ప్రోత్సహిస్తున్నందున ఈ అవార్డులకు ఎలాంటి ప్రాముఖ్యత లేకుండా పోతోంది. సినిమాలను మెరిట్‌తో పరిగణించలేనప్పుడు ఈ అవార్డులు ఎందుకు?' అని ప్రశ్నించారు.

## మల్లాది రాశారు... రాజా అనుకున్నారు... పూరి తీశారు...




గట్టిగా అనుకుంటే అయిపోతుంది అని అంటారు. కానీ ఒకరు రాసిన నవల, సినిమా వస్తే బాగుంటుందని వేరొకరు భావించారు. నాలుగు దశాబ్దాల తర్వాత అది కార్యరూపం దాల్చింది. ఈ సంఘటనల సమాహారాన్ని గమనిస్తే సినిమా స్టోరీలా అనిపిస్తుంది. కానీ ఇది నిజం. మల్లాది వెంకట కృష్ణమూర్తి 1971లో రాసిన 'మిసెస్ పరాంకుశం' నవల 44 సంవత్సరాల తర్వాత 2015లో 'జ్యోతి లక్ష్మీ' పేరుతో సినిమాగా వచ్చింది. ఈ మూవీ వచ్చి జూన్ 12కి పదేళ్ళు పూర్తయ్యింది. విశేషం ఏమంటే... ఆ సినిమాతో పూరి జగన్నాథ్, ఛార్మి మధ్య ఏర్పడిన అనుబంధం బలపడి వారిద్దరూ కలిసి సినిమాలు నిర్మించడం మొదలు పెట్టారు. పదేళ్ళుగా వారు కలిసి ప్రయాణం చేస్తున్నారు. అలానే ఆ సినిమాలో కీలక పాత్ర పోషించిన సత్యదేవ్ ఇవాళ తెలుగులో ప్రామిసింగ్ యాక్టర్ గా రాణిస్తున్నాడు. పరభాషా చిత్రాలలోనూ నటిస్తున్నాడు. 'జ్యోతి లక్ష్మీ' సినిమా కమర్షియల్ గా సక్సెస్ కాకపోయినా... నిర్మాత సి. కళ్యాణ్ ఎంతో ఇష్టంగా ఛార్మితో కలిసి ప్రొడ్యూస్ చేసిన మూవీ అది. అలానే ఈ సినిమా మేకింగ్ ఓ అందమైన పుస్తకం రూపంలోనూ ఆ తర్వాత వచ్చింది.

## ది ప్యారడైజ్.. నాని జడల్ లుక్




హ్యాట్రిక్ విజయాల తర్వాత నాచురల్ స్టార్ నాని నటిస్తోన్న కొత్త చిత్రం ది ప్యారడైజ్ . దసరా వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత శ్రీకాంత్ ఓదెల తిరిగి నానితో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండడంతో అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. ఈ సినిమాను 2026 సమ్మర్‌లో మార్చి26న థియేటర్లకు తీసుకు వస్తున్నట్లు ప్రకటిస్తూ ఈ మూవీ నుంచి విడుదల చేసిన గ్లింప్స్ పెను సంచలనమే సృష్టించింది. నాటి నుంచి నేటికి కూడా ఈ సినిమా వార్తల్లో నిలుస్తూనే వస్తోంది. అయితే.. ఈ మూవీ మేకర్స్ సడన్‌గా ఈ చిత్రం నుంచి ఓ అప్డేట్ ఇచ్చి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చారు. తాజాగా సినిమాకు సంబంధించి ఉదయం 10 గంటల 5నిమిషాలకు ప్రెసెంటింగ్ జడల్ అంటూ నాని జడలతో ఉన్న పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మరోక పోస్టర్‌ను సాయంత్రం 5 గంటలకు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే.. తాజాగా విడుదల చేసిన నాని పోస్టర్‌ను చూస్తే.. హాలీవుడ్ సినిమా మెన్ ఇన్ బ్లాక్3లో విలన్ పాత్రదారి బోరిస్ ది ఎనిమల్ లుక్‌ను పోలి ఉండడం గమనార్హం.

## బుల్లెట్ బండి టీజర్.. లారెన్స్ అన్నాదమ్ములు అదరగొట్టారుగా




ట్యాలెంట్ పవర్ హౌస్ రాఘవ లారెన్స్ ఆయన తమ్ముడు ఎల్విన్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కిన చిత్రం బుల్లెట్ బండి మిస్టరీ, క్రైమ్, యాక్షన్ అడ్వంచర్ థ్రిల్లర్‌గా రూపొందించిన ఈ మూవీని తమిళ చిత్రం 'డైరీ' ఫేం డైరెక్టర్ ఇన్నాసి పాండియన్ దర్శకత్తవం వహించగా ఫైవ్ స్టార్ క్రియేషన్స్ బ్యానర్‌పై కతిరేసన్ నిర్మించాడు. తెలుగమ్మాయి వైశాలి రాజ్ కథానాయికగా చేసింది. తాజాగా ఈ మూవీ మేకర్స్ చిన్న అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం టీజర్‌ను శుక్రవారం విడుదల చేశారు. %టీజర్ చూస్తుంటే.. గ్యాప్ ఇవ్వకుండా ఫస్ట్ షాట్ నుంచే సినిమాలోకి తీసుకెళ్లేలా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. విజువల్స్, యాక్షన్ సన్నివేశాలు ఎక్ట్రార్డినరీగా ఉన్నాయి. ముఖ్యంగా శ్యామ్ సీఎస్ బ్యాగ్రౌండ్ మ్యూజిక్ మరో లెవల్‌లో ఉండి టీజర్ మొత్తానికి హైలెట్‌గా నిలిచింది. గతేడాది జిగర్తాండ డబుల్ ఎక్స్ సినిమాతో మంచి విజయం, అంతకు మించి పేరు తన ఖాతాలో వేసుకున్న లారెన్స్ ఈ చిత్రంతోనూ మంచి హిట్ కొడతాడని గ్యారెంటీగా అనిపిస్తోంది. ఇదిలాఉంటే రియల్ స్టార్, స్వర్గీయ శ్రీహరి సతీమణి డిస్కోశాంతి చాలాకాలం తర్వాత ఈ మూవీతో రీ ఎంట్రీ ఇవ్వనుంది. అలాగే టాలీవుడ్ కమెడియన్ సునీల్ కీ రోల్ చేస్తున్నాడు. కానీ అతని డబ్బింగ్ తేడా అనిపిస్తోంది.

## కాంతార.. కనకవతి




కాంతార వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత కన్నడ నటుడు రిషబ్ శెట్టి నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'కాంతార ఛాప్టర్-1' . 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్‌గా రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 2న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ క్రమంగా ప్రచార కార్యక్రమాలకు నడుం బిగించారు. %అయితే ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి ఎలాంటి అప్డేట్, నటుల వివరాలు వెల్లండించని మేకర్స్ తాజాగా శుక్రవారం ఈ చిత్రంలో కథానాయికగా చేస్తోన్న రుక్మిణీ వసంత్ లుక్ రివీల్ చేస్తూ ఓ పోస్టర్ విడుదల చేశారు.

## అదిరిపోయే రొమాంటిక్ లవ్‌స్టోరి.. తెలుగులోనూ ఓటీటీకి వచ్చేసింది




తెలుగమ్మాయి గుత్తా జ్వాల భర్త, తమిళ నటుడు విష్ణు విశాల్ సోదరుడు రుద్రను కథానాయకుడిగా అరంగేట్రం చేయిస్తూ స్వయంగా నిర్మించిన చిత్రం ఓహో ఎంతన్ బేబీ . ఇందులో ఆయన ఓ క్యారెక్టర్ సైతం చేయడం విశేషం. కృష్ణకుమార్ రామ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామా చిత్రం గత నెల జూలై 11న థియేటర్లలోకి వచ్చి ఫర్వాలేదని అనిపించుకుంది. విశ్వక్ సేన్ ఓ మై బేబీ ఫేమ్ మిథిలా పాల్కర్ అంజు కురియన్ వైభవి తాండ్లే డైరెక్టర్ మిస్కిన్ , కస్తూరి, రెండ్ కింగ్ స్లే కీలక పాత్రల్లో నటించారు.

# టుడే బిజినెస్

# ఆల్‌టైం గరిష్ఠానికి పసిడి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే..




బిజినెస్ డెస్క్: దేశంలో పసిడి ధరలు ఆల్ టైం గరిష్టానికి చేరుకుని మరోసారి షాక్ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 8, 2025 ఉదయం 6:10 గంటల సమయానికి బంగారం ధరలు సరికొత్త స్థాయికి చేరాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,02,560కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 94,010కి చేరుకుంది. %ఇదే సమయంలో వెండి ధరలు కూడా పెరిగాయి . కిలో వెండి ధర రూ. 1,17,100 స్థాయిలో ఉంది. ఈ ధరల పెరుగుదల దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో కొనసాగుతోంది. స్థానిక పన్నులు, రవాణా ఖర్చులు, మార్కెట్ డిమాండ్ ఆధారంగా ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి.

# ఎల్ఐసి ఫలితాలు ఆకర్షణీయం





ముంబయి : దేశంలోనే అతిపెద్ద బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 4 శాతం వృద్ధితో రూ. 10,957 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ. 10,544 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ. 1,14,230.23 కోట్ల నికర ప్రీమియం ఆదాయం చోటు చేసుకోగా.. గడిచిన క్యూ1లో 4.7 శాతం పెరిగి రూ. 1,19,618.41 కోట్లకు చేరింది. కొత్త వ్యాపారం 20.75 శాతం పెరిగి రూ. 1,944 కోట్లుగా నమోదయ్యింది. "ఏడాదికేడాదితో పోల్చితే నూతన వ్యాపారం భారీగా పెరిగింది. మరోవైపు వ్యయ నిష్పత్తి 10.47 శాతం తగ్గింది." అని ఎల్ఐసి సిఇఒ, ఎండి ఆర్ దొరైస్వామి తెలిపారు. 2025 జూన్ ముగింపు నాటికి ఎల్ఐసి ఆస్తుల నిర్వహణ విలువ (ఎయుఎం) 6.47 శాతం పెరిగి రూ. 57.05 లక్షల కోట్లకు చేరింది. భారత స్థూల బీమా వ్యాపారంలో 63.51 శాతం మార్కెట్ వాటాతో ఈ రంగంలో ఆధిక్యతను కలిగి ఉన్నట్లు ఎల్ఐసి వెల్లడించింది. గడిచిన జూన్ త్రైమాసికంలో కొత్తగా వ్యక్తిగత సెగ్మెంట్‌లో 30,39,709 పాలసీలను విక్రయించింది. గతేడాది ఇదే త్రైమాసికంలోని 35,65,519 పాలసీలతో పోల్చితే 14.75 శాతం పెరుగుదల నమోదయ్యిందని ఎల్ఐసి తెలిపింది.

# స్టాక్ మార్కెట్ అప్‌డేట్..సెన్సెక్స్ 560 పాయింట్ల పతనం, నిఫ్టీ కూడా డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్లో నిన్న భారీ లాభాలను చూసిన ఇన్వెస్టర్లు ఈరోజు (ఆగస్టు 8, 2025) భారీ నష్టాలను చవి చూస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్‌తో ట్రేడ్ చర్చలు జరపనని, టారిఫ్‌ల విషయంలో వివాదం పరిష్కారం అయ్యే వరకు వాణిజ్య ఒప్పందాలు ఉండవని చెప్పడంతో మార్కెట్‌లో నిరాశ మొదలైంది. %ట్రంప్ భారత ఎగుమతులపై 50% టారిఫ్‌లు విధించారు, ఇది మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలో ఉదయం 11 గంటల సమయంలో సెన్సెక్స్ 560 పాయింట్లు నష్టపోయి 80,063 పాయింట్లకు చేరింది. మరోవైపు నిఫ్టీ 50 కూడా 186.6 పాయింట్లు తగ్గిపోయి 24,409.55 పరిధిలో ఉంది. దీంతో మదుపర్లు కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల కోట్ల రూపాయలను నష్టపోయారు.ఇదే సమయంలో సెన్సెక్స్‌లో భారతి ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ వంటి స్టాక్స్ టాప్ నష్టాల కంపెనీల్లో ఉండగా, టైటాన్, , బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా వంటి కంపెనీలు కాస్త పాజిటివ్‌గా ట్రేడ్ అవుతున్నాయి. సెక్టార్ల విషయానికొస్తే నిఫ్టీ రియల్టీ, మెటల్ సెక్టార్లు 1% కంటే ఎక్కువగా పడిపోయాయి. ఆటో, బ్యాంక్, ఎనర్జీ, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్ వంటి సెక్టార్లు కూడా నష్టాల్లో ఉన్నాయి. కానీ, నిఫ్టీ ఆయిల్ గ్యాస్, మీడియా సెక్టార్లు మాత్రం కొంచెం గ్రీన్‌లో ట్రేడ్ అవుతున్నాయి.

# కొత్త వ్యాపారాలే చోదక శక్తులు



న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) వ్యాపార స్వరూపం మారిపోతోంది. ఇప్పటి వరకు పెట్రో కెమికల్స్, చమురు, గ్యాస్ ఉత్పత్తి, వాటి రిఫైనింగ్.. కంపెనీ వ్యాపారాలకు ప్రధాన ఆధారం. ముందు ముందు రిటైల్, డిజిటల్ సేవలు, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్, కొత్త తరహా ఇంధన వ్యాపారాలు కంపెనీ అభివృద్ధికి ప్రధాన చోదక శక్తులు కానున్నాయి. తాజా వార్షిక నివేదికలో వాటాదారులను ఉద్దేశించిన రాసిన ముందు మాటలో ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయం వెల్లడించారు. ఇదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్ఐఎల్ డీప్ టెక్ కంపెనీగా రూపాంతరం చెందుతుందన్నారు. ఇందుకోసం దాదాపు వెయ్యి మందికి పైగా శాస్త్రవేత్తలు కృత్రిమ మేథ (ఏఐ), పునరుత్పాదక ఇంధన వనరులు, అధునాతన లోహాల అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ కోసం పని చేస్తున్నట్టు వెల్లడించారు. వీరు అభివృద్ధి చేసిన ప్రతి టెక్నాలజీని ఆర్ఐఎల్‌కు చెందిన ప్రతి వ్యాపార విభాగంలో భాగం చేస్తామన్నారు. అంతర్జాతీయ టెలికాం రంగంలో ప్రధాన శక్తిగా ఎదిగేందుకు ఆర్ఐఎల్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఆరో తరం (6జీ) టెలికాం టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు అంబానీ కంపెనీ వార్షిక నివేదికలో వెల్లడించారు.. తమ చర్యలన్నీ భారత్‌ను తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. కొత్త వ్యాపారాలతో పాటు పాత వ్యాపారాలైన పెట్రో కెమికల్స్, రిఫైనింగ్ రంగాలపైనా తమ దృష్టి కొనసాగుతుందని అంబానీ తెలిపారు.

# ట్రంప్ సుంకాలతో ఆగమాగం




న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజా సుంకాల పోటుతో దేశీయ పరిశ్రమ గగ్గోలు పెడుతోంది. ఈ దెబ్బతో భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే రొయ్య లు, దుస్తులు, ఆర్గానిక్ కెమికల్స్, మెషినరీ, మెకానికల్ అప్లయెన్సెస్, రత్నాభరణాల ఎగుమతులు 50 నుంచి 70 శాతం తగ్గిపోయే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్షియేటివ్ (జీటీఆర్ఐ) అనే మేధో సంస్థ గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. చైనా, వియత్నాం, బ్రెజిల్ దేశాలతో పోల్చితే భారత్ మాత్రమే అధికంగా నష్టపోనుందని పేర్కొంది. రొయ్యలు, ఆర్గానిక్ కెమికల్స్, కార్పెట్స్, అల్లిన వస్త్రాలు (నిట్టెడ్ అండ్ వోవెన్ అపారెల్స్), వజ్రాలు, బంగారు ఆభరణాలు, ఫర్నిచర్ వంటి ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు 50–70 శాతం వరకు తగ్గిపోయే అవకాశం ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ తెలిపారు. కాగా స్టీల్, అల్యూమినియం, కాపర్, ఆటో విడి భాగాల ఎగుమతులు 30 నుంచి 50 శాతం తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఫార్మా, స్మార్ట్‌ఫోన్స్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులపై సుంకాల ప్రభావం చాలా తక్కువ ఉండనుందని శ్రీవాత్సవ పేర్కొన్నారు.వస్త్ర పరిశ్రమ మాత్రం ట్రంప్ తాజా సుంకాలను జీర్ణించుకోలేక పోతోంది. మన వస్త్ర ఎగుమతులపై ట్రంప్ సుంకాలను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచేశారు. ఇది ఎగుమతులపై ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై అధికంగా ఆధారపడిన ఎంఎసఎంఈ సంస్థలకు చావు దెబ్బ అని ఈ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే ఏపీఈసీ చైర్మన్ సుధీర్ సెక్రీ తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే ఆర్థికంగా పరిశ్రమను ఆదుకోవాలని కోరారు. మన దుస్తుల ఎగుమతిలో అమెరికాకు 33 శాతం వాటా ఉన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# రూ 150 కోట్లతో పిట్టీ ఇంజనీరింగ్ విస్తరణ




వృద్ధి అవకాశాలతో పాటు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుతున్నట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. రూ. 150 కోట్ల పెట్టుబడితో పిట్టీ ఇంజనీరింగ్ ప్లాంట్ విస్తరణతో పాటు అనుబంధ సంస్థలైన పిట్టీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ ఉత్పత్తి కార్యకలాపాలు విస్తరించనున్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రతిపాదిత పెట్టుబడులతో ప్రస్తుతం 90,000 ఎంటీలుగా ఉన్న కంపెనీ కన్సాలిడేటెడ్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,08,000 ఎంటీలకు పెంచటంతో పాటు ఫౌండ్రీ సామర్థ్యాలను 18,600 ఎంటీల నుంచి 24,000 ఎంటీలకు విస్తరించనున్నట్లు తెలిపింది. దశలవారీగా 18 నెలల్లో ఈ విస్తరణ కార్యకలాపాలను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. కాగా జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ రూ. 463.96 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ. 22.88 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది.

# 2025: సెప్టెంబరులో అల్యూమెక్స్ ఇండియా

ఢిల్లీ మరో అంతర్జాతీయ సదస్సుకు వేదికవుతోంది. 'అల్యూమెక్స్ ఇండియా–2025' పేరుతో సెప్టెంబరు 10–13 తేదీల మధ్య ఈ సదస్సు జరుగుతుందని అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (అలెమై) జాతీయ అధ్యక్షుడు జితేంద్ర చోప్రా చెప్పారు. ఈ సదస్సు లో 250కిపైగా దేశ, విదేశీ కంపెనీలు తమ స్టాల్స్ ఏర్పాటు చేస్తాయన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశీయ అల్యూమినియం పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, ఉన్న అవకాశాలపై చర్చించనున్నట్టు చోప్రా తెలిపారు. దేశ అల్యూమినియం ఎక్స్‌ట్రూజన్ ఉత్పత్తుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు దక్షిణ భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.



TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006